క్లుప్తంగా

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి

శావల్యాపురం: ఉపాధి కూలీలకు సంబంధించి ఆధార్ వివరాల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 6500 మంది ఉపాధి కూలీలు ఉండగా ఇప్పటి వరకు 2500 ఆధార్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఆధార్ నమోదు చేయటం వలన భవిష్యత్‌లో కూలీలకు సంబంధించి బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, కూలీల మస్టర్ వివరాలు పారదర్శకంగా ఉంటాయన్నారు.

కారుమంచి ఇన్‌చార్జి కార్యదర్శిగా 'చింతా'

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా చింతా శ్రీనివాసరావును నియమాకం చేసినట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ప్రస్తుతం ఈయన మండలంలోని వయ్యకల్లు, గుంటుపాలెం, చినకంచర్ల గ్రామపంచాయతీలకు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాస్

గురజాల : వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎ మోహన్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో మరమ్మతులకు గురైన బోర్లును గుర్తించి వాటిని మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వేసవి కాలంలో నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి ఆధ్వర్యంలో 20కి పైగా బోర్లును మరమ్మతులు చేసినట్లు తెలిపారు. నీటి ఎద్దడి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

ఉత్తర ద్వార దర్శనానికికు ఏర్పాట్లు పూర్తి



ప్రత్యేక అలంకరణలో సీతా సమేత రామచంద్రుడు

అచ్చంపేట: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ సీతారామస్వామి దేవాలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 126 ఏళ్లుగా అచ్చంపేటలో ముక్కోటి ఏకాదశి తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తెల్లవారు జామున సీతాసమేతుడైన శ్రీరామచంద్రునికి అర్చనలు, మూలమూర్తికి స్నపన ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు సాక్షాత్కారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం, శ్రీ లక్ష్మీ తిరుపతాంబ భజన సమాజం..వేర్వేరుగా భజన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. మహిళా విభాగం ద్వారా తిరుప్పావై విష్ణు సహస్రనామార్చనలు జరుగుతాయి. మధ్యాహ్నం 1 గంటకు సీతాసమేతుడైన శ్రీరామచంద్రుల వారు దేవాలయాలనికి సమీపంలో ప్రత్యేకంగా నిర్మించిన కొఠారు(పెద్దపందిరి)లో ప్రవేశిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి పరిటాల రాజశేఖర్ బృందం సన్నాయి మేళాలతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు పాత పోస్టాఫీసు సెంటర్‌లో శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి సత్య హరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించబడు తుంది. ఈ సందర్భంగా సీతారామ స్వామి దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే భక్తుల భోజన సౌకర్యం కోసం దేవాలయ పరిసరాలలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు.

అమరేశ్వరస్వామి దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

అమరావతి: పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామిదేవ స్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరేశ్వరాలయం అర్చకులు ఎమ్మెల్యే శంకరరావు దంపతులకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో సునీల్ కుమార్ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కార్పెంటర్ యూనియన్ అధ్యక్షుడిగా శివకోటేశ్వరరావు

అమరావతి: మండల కార్పెంటర్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగాయి. మండల సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, షేక్ రఫీ ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా షేక్ ఆదాం సాహెబ్, అధ్యక్షుడిగా చెన్నమల్లు శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కంభంపాటి కరుణాకర్, షేక్ నాగుల్ మీరా, కార్యదర్శిగా షేక్ ఖాన్ సాహెబ్, సంయుక్త కార్యదర్శులుగా అనిల్, జె.హరికృష్ణ, కోశాధికారిగా జి.రాములును ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సభ్యులు అభినందించారు.

జగనన్న పాలనలో ప్రతి రోజూ పండుగే

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- రోడ్లపై యువత సంబరాలు
- ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతి రోజూ పండుగేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లోని మంత్రి కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని పాల్గొని భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో అన్నివర్గాల ప్రజల్లోనూ సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని చెప్పారు. సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకున్న జగనన్న ప్రతి ఇంటా సంతోషాలు పంచేందుకు అద్భుతమైన పాలన అందజేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల ఉన్నతి, సంక్షేమం కోరే ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి మంత్రి రజినికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గజ మాలలతో మంత్రిని సత్కరించారు. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎంపీపీలు దేవినేని శంకరరావు, తలతోటి రాణి, పిడతల ఝాన్సీ, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా శ్రీనివాస్, నాయకులు విడదల లక్ష్మీనారాయణ, విడదల కుమారస్వామి, విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు..

శావల్యాపురం: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, అనిల్‌కుమార్ దంపతులు, శావల్యాపురం సొసైటీ అధ్యక్షులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దంపతులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వినుకొండ పట్టణ సీఐ బోడ్డు అశోక్‌కుమార్, రూరల్ సీఐ ఎస్.రమేష్‌బాబు, ఎస్సైలు చెన్నకేశవులు, రాజ్యాలక్ష్మి, విప్పర్ల వెంకట్రావు, అనిల్‌కుమార్, బలరాంరెడ్డి, పోలీసు సిబ్బంది ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును గజమాలతో సత్కరించి నూతన సంవత్సరం కేకును కట్ చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, సొసైటీ మాజీ చైర్మన్ ముండ్రు సాంబశివరావు, కృష్ణారావు, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు ఉన్నారు.

అంతటా న్యూ ఇయర్ జోష్

నరసరావుపేట: నియోజకవర్గవ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. యువత పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకోగా, పలు మందిరాల్లో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్ అరవై అడుగుల రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పార్టీ కుటుంబసభ్యులు, పోలీసు, ఎక్సైజు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, నాయకులు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేచే కేకులు కట్‌చేయించి దుశ్శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి ఏర్పాటుచేసిన అన్నదానంను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రార్థన మందిరాల్లో..



తన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

శావల్యాపురం: మండలంలో అన్నీ ప్రార్థన మందిరాల్లో నూతన సంవత్సర వేడుకలతో పాటు ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శావల్యాపురంలో విమోచన ప్రార్థన మందిరంలో పాస్టర్ సీహెచ్ యేహెజ్కేలు ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మండలంలోని వయ్యకల్లు గ్రామంలో స్వస్థత ప్రార్థన మందిరంలో దైవసేవకులు వి.ఏసుపాదం, శూలవతి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పేదలకు నూతన వస్త్రాలు అందజేశారు. ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణమండపం నందు శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కార్యాలయంలో...

నరసరావుపేట: స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, అధికారులు హాజరై ఎంపీచే కేకులు కట్‌చేయించి పూలదండలు వేసి దుశ్శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో...

శావల్యాపురం: 2023 నూతన సంవత్సర వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్యలకు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, పరిపాలన అధికారి వాణి, జూనియర్ సహాయకురాలు కారుచోలు భారతిలు పూలమాలలతో పాటు మిఠాయిలు తినిపించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి రవి, దూదెకుల పెద మదార్, పొట్టిపాటి శ్రీను, తదితరులు ఉన్నారు.



వినుకొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు,



నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిచే కేక్ కట్ చేయిస్తున్న డీఎస్పీ విజయభాస్కరరావు, పోలీసు అధికారులు

మాజీ మంత్రి కాసు గృహంలో ...

నరసరావుపేట: పట్టణంలో మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఆయన కుమారుడు గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి గృహంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వారిద్దరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి కాసుచే భారీ కేకును కట్‌చేయించి భారీ పూలదండను వేశారు. కోటప్పకొండ దేవస్థానం ఈఓ గోపి ఆధ్వర్యంలో వేద పండితులు కాసు దంపతులకు ఆశీర్వచనం అందించారు. చర్చి ఫాదర్లు ప్రార్థన నిర్వహించగా, ముస్లిం పెద్దలు నమాజ్ చదివి కాసుని దీవించారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలియపరచడానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.



కాసు కృష్ణారెడ్డిచే భారీ కేకును కట్‌చేయించి పూలదండ వేస్తున్న అభిమానులు

ఆనందమని పింఛెన్

- పెరిగిన, నూతన పింఛన్లు అందజేసిన ప్రజాప్రతినిధులు
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



వినుకొండలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నరసరావుపేట పదో వార్డులో పింఛన్ అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రమణారెడ్డి, వలంటీరు

వినుకొండ(నూజెండ్ల): కొత్త సంవత్సరంతో పాటు నేటినుంచి వారం రోజుల పాటు రాష్ట్రంలో పింఛన్ వారోత్సవాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే ఆదివారం వినుకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ నందు జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది అవ్వాతాతలు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారుల ఇళ్లలో కొత్త వెలుగులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు ప్రతి నెలా రూ.2500చొప్పున అందుకుంటున్న లబ్ధిదారులు ఈ రోజు నుంచి ప్రతి నెలా రూ.2,750ల చొప్పున అందుకుంటారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పింఛన్ నగదు మొత్తాన్ని వలంటీర్లు లబ్ధిదారులకు నేరుగా ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు 39లక్షల మందికి మాత్రమే పింఛనుల పంపిణీ చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సంతృప్త స్థాయిలో అర్హులందరికి వంద శాతం పింఛన్లు మంజూరు చేసే విధానం తీసుకొచ్చారన్నారు. తద్వారా 2019లో 52.17లక్షలకు, 2022లో 62.31లక్షలకు, 2023లో రూ. 64.06 లక్షలకు పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పురపాలక పరిధిలో నూతన సంవత్సర వేడుకల మధ్య పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ ఏడాది రూ.250లు అదనంగా మంజూరుచేసిన సొమ్ముతో కలిపి ప్రతి ఒక్కరికీ మొత్తం రూ.2750లు పంపిణీ చేశారు. పురపాలక పరిధిలో మొత్తం 10,794మంది లబ్ధిదారులు ఉండగా 292మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయి. ఉదయాన్నే వలంటీర్లు, సచివాలయ సంక్షేమ కార్యదర్శులు లబ్ధిదార్ల ఇళ్లకు వెళ్లి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్ల పంపిణీలో పలు వార్డుల్లోని మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని పింఛన్లు అందజేశారు.

శావల్యాపురంలో 56 శాతం ...

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 5768 మంది పింఛనుదారులకు ప్రభుత్వం పెంచిన పింఛనునగదు రూ.2750లు ఆయా గ్రామాల్లోని వలంటీర్లు పంపిణీ చేపట్టినట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తొలిరోజు 56 శాతం పింఛనుదారులకు నగదును వలంటీర్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. 216మంది నూతన పింఛనుదారులకు ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు పింఛను వారోత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు.



గొట్టిపాడు గ్రామంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

తొలిరోజు 80శాతం అందజేత...

చిలకలూరిపేటటౌన్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా ప్రతి నెలా ఒకటో తేదీ అందించే పెన్షన్లను వలంటీర్లు ఆదివారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి అందజేశారు. పట్టణ పరిధిలో 75 శాతం, మండల పరిధిలో 80.1 శాతం పెన్షన్లు పంపిణీ చేశారు. పెంచిన పింఛన్లు ఈ నెల నుంచే అందించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: నూతన సంవత్సరం కానుకగా గతంలో పంపిణీ చేస్తున్న పెన్షన్‌కు అదనంగా రూ.250 పెంపుదల చేయడంతో లబ్ధిదారులో సంతోషం వెల్లివిరిసింది. ఆదివారం తెల్లవారుజామునుంచే మండలంలో పెన్షన్ పంపిణీ ప్రక్రియను వలంటీర్లు ఇళ్లకు వెళ్లి అందజేశారు. దీనితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం కరపత్రాలను పంపిణీ చేశారు. వీటితో పాటు కొత్తగా మరో 261 పెన్షన్‌లు మంజూరు అయ్యాయి. దీంతో యడ్లపాడు మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో సామాజిక భద్రత పెన్షన్ దారులు సంఖ్య 7980కి చేరింది. ఒకటో తేదీ ఒక్కరోజే 6454 మందికి రూ. 17662750 కోట్లు నగదు లబ్ధిదారులకు అందజేయడంతో 80.88 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది.

పింఛన్లు, రేషన్ కార్డులు ఎవరికీ ఆగవు

- స్పష్టం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- దుష్ప్రచారం నమ్మొద్దని హితవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో రేషన్‌కార్డులు, పింఛన్‌లు ఆపే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 3వేలమంది లబ్ధిదార్లకు విచారణ నిమిత్తం నోటీసులు ఇచ్చారని, అయితే వాటిని తొలగించే ప్రసక్తే లేదని వెల్లడించారు. స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, లబ్ధిదారుల వద్ద నుంచి అఫిడవిట్ స్వీకరించి పునరుద్ధరించమని చెప్పారన్నారు. లబ్ధిదారులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. దీనిపై ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 39లక్షలమందికి ఇవ్వగా ఇప్పుడు 62.5 లక్షల మందికి ఇస్తున్నారన్నారు. నెలకు రూ.1700 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. ప్రతి నెలా మొదటిరోజునే ఇంటికొచ్చి డబ్బులు ఇస్తున్నారన్నారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందజేస్తున్న రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు.

ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

నాదెండ్ల: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆలయాలు సిద్ధమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం ఉత్తరద్వార దర్శనం జరగనుంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గణపవరంలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి, వీరాంజనేయస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే పూజలు, ఉత్తరద్వార దర్శనం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అనుమంచి చంద్రశేఖర్ తెలిపారు.

నేడు పలు ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి సిద్ధం..

యడ్లపాడు: ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలకు పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ముక్కోటి సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం చేసేవిధంగా ఏర్పాటు చేసినట్లు ధర్మకర్తలు తెలిపారు. సోమవారం వేకువజాము నుంచే ఆలయాల్లో పండుగ ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభం అవుతాయని ధర్మకర్తలు తెలిపారు.

సిరిపురంలోని ఏసు నామకరణ ఆలయం సందర్శన



మేడికొండూరు: మండలంలోని సిరిపురంలో ఆదివారం ఏసునామకరణం ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, బీవీ సుబ్బారెడ్డి, మన్నవ రాజేష్, రన్నుహుస్సేన్, అబ్దుల్లా, పిల్లి సుధీర్, జోసఫ్ రెడ్డి పాల్గొన్నారు.

కానుక మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

రెంటచింతల: ఎన్నో ఆశలను మోసుకొస్తున్న కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలుకుతూ చెదరని సంకల్పాలు తీసుకుని పరిపూర్ణమైన ఆనందంతో జీవించాలని మల్లేపల్లి విచారణ గురువులు రెవ. ఫాదర్ హృదయ్ అన్నారు. శనివారం అర్ధరాత్రి స్థానిక కానుక మాత చర్చి ఆవరణలో నిర్వహించిన పవిత్ర దివ్య పూజాబలిలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. 2023వ సంవత్సరం దేవుని పేరిట ఆయన నామమును స్తుతిస్తూ ఏ పని తలపెట్టినా విజయవంతమౌతుందన్నారు. ప్రతి జనవరి 1వ తేదీన ప్రపంచంలోని ప్రతి కథోలికులు మరియతల్లి దివ్య మాతృత్వ మహోత్సవమును ఏసు నామకరణ మహోత్సవాన్ని కొనియాడుతుంటారు. మనం కూడా మరియతల్లి చూపిన బాటలో నడిచి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలన్నారు. అర్ధరాత్రి 12గం''ల సమయంలో గంటలు కొడుతూ గ్లోరియా పాడుతూ ఘనంగా ప్రభువును స్తుతిస్తూ భారీగా బాణాసంచా కాలుస్తూ 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం ఈ దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కేకలు, క్యాలండర్లను పంపిణీ చేశారు. ఈ పూజాబలిలో కానుక మాత విచారణ గురువులు రెవ. ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి, సాగర్‌మాత జూనియర్, విజ్‌డమ్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ రెవ. ఫాదర్ కొనణం ఎలీషా రాజు, డీకన్ బ్రదర్ ఆర్ అనిల్‌కుమార్, కన్నె స్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు, చర్చిలు

మాచర్ల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆయా చర్చిలలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్రార్థనలు, ప్రేమ విందు కార్యక్రమాలు నిర్వహించారు. కేసీపీ వెళ్లే రహదారిలోని నిత్య సహాయ మాత ఆర్‌సిఎం చర్చిలో పాస్టర్ కొమ్మారెడ్డి రాయపరెడ్డి, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతన సంవత్సర వేడుకలు జరిపారు. ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్‌చర్చిలో నూతన సంవత్సర వేడుకలను జిల్లా పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల బిజయ్య, చర్చి పాస్టర్ రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది క్రైస్తవులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చర్చి సభ్యులు మాచర్ల జాన్, వాసు, ఇస్రాయేలు, బొల్లెద్దుల జాషువా, సంసోన్, సత్యం ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

5న సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 5వ తేదీన సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మండల, గ్రామ స్థాయి అధికారులు అందరు హాజరు కావాలన్నారు.

నేడు వలంటీర్ల, కన్వీనర్ల సమావేశం

యడ్లపాడు: వలంటీర్లు, కన్వీనర్లు, నాయకుల సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.హనుమారెడ్డి తెలిపారు. యడ్లపాడు గ్రామంలోని హైవే పక్కనే ఉన్న టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని హాజరవుతారన్నారు.